స్కెచ్:

# రోడ్

'వి'

మే నెల మధ్యాహ్నం, రెండంతస్థుల మేడమీద, ఫోల్డింగ్ స్టీల్ కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న కథారచయిత లేచి, కిటికీకి అడ్డంగావున్న తెర తొలగించి రోడ్డును గమనించిన ఆక్షణంలో—

పిల్లవాడి తండ్రి రోడ్డు మలుపుమీద, ఫుట్‌పాత్ పక్కన- రాత్రిళ్ళు మలమూత్రశాలగా వుపయోగింపబడే రాజమార్గాన- పాడుబడ్డ మసీదు ముంగిట గుడ్డపరచుకుని పడుకుని, ఆశతో అతిప్రయత్నంమీద కళ్ళుతెరచి ఖాళీగావున్న గుడ్డనుచూచి, తను పొద్దుటనుండి ఎప్పటికప్పుడు భద్రంచేసిన పైసలు పదికి మించలేదని నిట్టూరుస్తూ మాగన్నుగా కునికిపాట్లు పడుతున్నప్పుడు—

వాడితల్లి ఇదివరలో పక్కనేవున్న ఆంజనేయుడిగుడిముందు బిచ్చమెత్తుతూ వుండి, రోగం నానాటికి ముదరటంవల్ల, పుళ్ళలోంచికారే రసి, చీము వాసన భరించలేకుండా వుండటంవల్ల, నలుగురూ మక్కెలిరగతంతామని బెదిరించటంవల్ల, అదే మసీదు ఆవరణలో అటుపక్క ఓచెట్టుకిందికి మకాంమార్చి, ఎండ తగలకుండా ఒదిగి కూర్చుని, పుళ్ళపైవాలుతున్న ఈగల్ని తోలుకోలేక అవస్థపడుతూ, రోడ్డునుపాలిస్తున్న ఎండని చూళ్ళేక కన్నులరమూత పడుతున్నప్పుడు—

ఆతల్లిగన్న పిల్లవాడు, పన్నెండేళ్ళవాడు, ఓరోజు గుడ్డివాడుగా, ఓరోజు కుంటివాడుగా, మరికొన్నిరోజులు సినిమా కర్యాలముందు పాటలుపాడి, డ్యాన్సుచేసి, మరోసారి మరేవో మరేవో పనులుచేసి రోజుకు రూపాయకు తగ్గకుండా సంపాదిస్తూ, పదిపైసలకు తగ్గకుండా బీడీలుకాలుస్తూ, మరోపదిపైసలకు వేరుశెనక్కాయలు కొనుక్కుతింటూ, రోగిష్టితల్లికీ, లేవలేని తండ్రికీ హోటళ్ళలో గంజో ఓరొట్టో కొనుక్కొస్తూ, రాజుకుంటున్న బూట్‌పాలిష్‌సెట్ కొనుక్కోవాలనే కోరికను అణచుకోలేక అందులో ఎంతోకొంతడబ్బు మిగులుస్తూ, ఇంకా మిగిలినదానిలో పక్కనేవున్న ఇరానీహోటల్లో చా పోయించుకు వచ్చి, తను కొంత తాగి, తండ్రికికొంత ఎంగిలిచేయించి మిగతాది

తల్లికిస్తూ, ఈగల్తో వేగలేక మూలుగుతున్న రోగిష్టితల్లి వినోదంకోసం, కొన్నాళ్ళగా ఆ రోడ్డుమీద తచ్చాడుతూ తండ్రి ముంగిటపరచిన గుడ్డమీద పోగైన డబ్బుల్ని దొంగ చాటుగా తీయబోయిన ఓ కుజ్జ బిచ్చగత్తెని తను ఎట్లా అక్కడే నెత్తురొచ్చేదాకా తన్ని, ఎట్లా నోటికొచ్చిన బూతుకూతలంతాకూసి, ఎట్లా తిట్టి, ఎట్లా ఉమ్మేసి, ఎట్లా అవమానించి(?) ఆనందించాడో ఆ ఘనకార్యం వివరంగాచెబుతూ, ఇంకోరోజు ఇంకేదోచెప్పి నవ్విస్తూ, పొద్దుపుచ్చుతున్న కుజ్జవాడు, ఆరోజు పొద్దుటనుండీ తను సంపాదించిందేమీ లేనందుకు విచారిస్తూ, తల్లిదగ్గరున్న అల్యూమినియం గిన్నెమ తీసుకుని, తను దాచిన డబ్బులోంచి పావలా నాణెం చేతబట్టుకొని, ఇరానీ హోటల్వైపు గబగబా అడుగులు వేస్తున్నప్పుడు—

అప్పుడు, అప్పుడే, వెనకాల, స్మూత్‌గా గాలినికోసుకుంటూ పరుగెడుతున్న కొత్తగా మార్చిన '66 మాడల్ ఫియట్‌లో సేట్‌జీ— మొన్నటి ఎలక్షన్లో చిత్తుగా ఓడిపోయినా, రేసెస్‌లో పాతికవేలు గెల్చిన సంబరంలో తేలిపోతూ, ఇన్‌కంటాక్స్‌గొడవల్లో చితికిపోతూకూడా, కొడుకును స్టేట్స్‌కు పంపడానికి అవసరమైన ఫారిన్‌ఎక్చేంజి వ్యవహారం తేల్చుకున్నందుకు తృప్తిపడుతూ, తలమీద అప్పుడప్పుడూ నెరసిన వెంట్రుకలు పొడసూపుతున్నా, ఖరీదైన హెయిర్‌డార్కెనర్ల సహాయంతో సులువుగా రంగు మార్చేసి, నడివయసు దాటినా తనకింకా వయసు మళ్ళలేదని నచ్చజెప్పుకుంటూ, ఊహల్లో— బోట్‌క్లబ్‌లో మిసెస్ మాలిని గులాబీరేకుల్లాంటి చేతుల్లో నలిగిపోతూకూడా, చంచలమైన మనసు రోడ్డుపక్క—

ఏడేళ్ళక్రితం— లేచిపోయినవాడితో ఏడాదైనా కాపురంచేయకుండానే కొత్తగూడెం బొగ్గుగనుల్లో వాడు బొగ్గైపోగా, తార్పుడుగత్తెగా కాలం వెళ్ళబుచ్చుతున్న తల్లిముండ పంచన చేరలేక, ఉన్న ఒక్కనలుసుకోసం పొట్టచేతబట్టుకొని, అంటుతోమి వంటచేసి, హోటళ్ళలో పిండిరుబ్బి, నానాచాకిరీచేసి, తనమానానతాను బ్రతుకుతుండగా ఈగల్లా చుట్టూముసిరే మగపురుగుల్ని విదిలించి విదిలించి చివరికి ఓరోజు సారాకొట్టు నర్సిగాని కబంధహస్తాల్లోంచి బయటపడలేక అలసి సోలిపోగా, వాడు అవసరం తీరగానే కుక్కను విసరికొట్టినట్టు అదలించి వెళ్ళగొట్టగా, ఏడుస్తూ, సర్వస్వంపోగొట్టుకునీ ఉన్నఒక్క నలుసుకోసం— బళ్ళోకెళుతున్న తన ఆరేళ్ళ పిల్లాడికోసం, వాడి 'బంగారు భవిష్యత్తు' కోసం, రెక్కలు ముక్కలుచేసుకుంటూ, మధ్యాహ్నంవేళల్లో గుడిసెలో ఒక్కర్తీ కూర్చోలేక పళ్ళబేరం సాగిస్తున్న పళ్ళమ్మిమీదవాలగా—

'బజారుముండ, దీనికింకా యవ్వనం బిగిసడలలేదేమా' అని ఆశ్చర్యపోతూ, అది పారేసిన పాసింగ్ గ్లాన్స్‌కు మైకంకమ్మి, వజ్రపుటుంగరాలు పొదిగిన

379

వేళ్ళు స్టీరింగ్ పట్టుదప్పగా, కుదుపుకు తెలివితెలిసి, బ్రేక్ వేస్తూ, కేకవేశాననుకొని మరుక్షణంలో తను నోరుమాత్రం తెరిచాననీ, కేకవేసింది తనకారు ముందరి చక్రాలకింద మృత్యువుతో పోరాడుతున్న ఆపన్నెండేళ్ళ కుర్రవాడనీగ్రహించి, గబగబా కారు దగ్గరికి ఆత్రంగా వస్తున్న పళ్ళమ్మిని గమనించి, కనుబొమలు ముడిచి, కారుతలుపు తెరచి, నెమ్మదిగా మేనెల మధ్యాహ్నపుఎండలో తళతళా మెరుస్తున్న బూటుకాలును జాగ్రత్తగా రోడ్డుమీద మోపాడు.

కారుదిగిన సేట్‌జీ రక్తం మడుగులో బోర్లాపడివున్న కుఱ్ఱవాణ్ణి వెల్లకిలా తిప్పబోయి, ఆగిపోయి, ఖరీదైన చేతివేళ్ళతో శ్వాస పరీక్షించి, అది ఎప్పుడో ఆగిపోయిందని తెలుసుకుని, గాబరాగా పరిసరాలను పరీక్షించి రోడ్డు నిర్మానుష్యంగావున్నదని గ్రహించి, తమాయించుకుని, పళ్ళమ్మినీ, కాస్తదూరంలో బోర్లా పడివున్న అల్యూమినియం గిన్నెనూ, నిర్జీవంగాపడివున్న కుఱ్ఱవాణ్ణీచూస్తూ ఏంచేయాలో దిక్కుతోచక నిల్చున్న సమయంలో—

మసీదు ముంగిట కునికిపాట్లుపడుతున్న కుఱ్ఱివాని తండ్రి కళ్ళు తెరచి ఎదురుగా కనిపిస్తున్న దృశ్యాన్నిచూసీ నమ్మలేక, మరోమారు కళ్లనులుపుకుని చూసి, తను కలగనటంలేదని నిర్ధారించుకుని, తూలుతూ లేచివచ్చి బావురుమని ఏడుస్తుండగా—

అదివిని అంతవరకు మసీదు ఆవరణలో ఈగల్తో వేగలేక అవస్థపడుతున్న తల్లి ఏమయిందోనన్న ఆత్రింలో— తన కురుపులనుండి వచ్చే కంపు భరించలేక జనం తంతారేమోనన్న భయంకూడా విస్మరించి లేనిశక్తిని కూడగట్టుకొని కారువద్దకొచ్చి, ఎదురుగా కనిపిస్తున్న కొడుకుశవాన్ని. ఏడుస్తూకూర్చున్న మొగుణ్ణీచూసి, కళ్లుతిరిగి, నిలదొక్కుకోలేక కుప్పలా కూలిపోయి, మెల్లగాతేరుకుని, వాడు తననూ, తనమొగుణ్ణీ ఎలాపోషించుకువస్తున్నదీ పేరుపేరునా ఏకరువుపెడ్తూ, రాగాలుతీస్తూ ఏడుస్తూవుండగా-

పళ్ళమ్మి ఆ దృశ్యంచూసి ఏమీ పాలుపోక బిత్తరచూపులు చూస్తూవుండగా,

సేట్‌జీ అసహనంగా పచార్లుచేస్తూ, వాళ్లకు ఎలా సర్దిచెప్పాలో అర్థంకాక, ఈ అరుపులువిని ఎవరైనా వస్తారేమోనన్నభయంతో మెల్లగా ఉడాయిద్దామన్న ఆలోచనలో వుండగా—

అప్పుడే—

పక్కసందులో దొంగసారాకొట్టు నర్సిగానివద్ద తన 'మామూలు'పుచ్చుకుని మలుపుతిరిగి కానిస్టబుల్, అల్లంతదూరంలో జరిగే గొడవవిని, నిల్చున్నకారునుచూసి,

380

గబగబా కళ్ళు వూపుకుంటూ నడచివచ్చి. కుఱ్ఱవాని శవాన్నీ, కుమిలి కుమిలి ఏడుస్తున్న ముసలి బిచ్చగాళ్ళనూ, బిత్తరపోయిచూస్తున్న పళ్ళమ్మినీ. చిరాకుగా మొహం చాటు చేసుకుని కడుపులో కలవరం బయటపడనివ్వకుండా దర్జాగా చుట్టకాల్చుకుంటున్న సేట్ జీని, అతని పొడుగాటి శిల్కులాల్చీ జేబులో లీలగా కనిపిస్తున్న నోట్లకట్టల్నీ. రక్తంతో తడిసినకారు మడ్ గార్డ్ నూ, చక్రాల్నీ మార్చిమార్చి చూసి పరిస్థితిగ్రహించి, సేట్ జీ లాల్చీజేబువైపు లాగుతున్న తనచూపుల్నీ అదుపులోపెట్టుకుంటూవుండగా—

జేబులోని నోట్ బుక్ నూ పెన్సిలునూతీయడానికి ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్న కానిస్టబుల్ ఇంగితం అనుభవశాలియైన సేట్ జీ సులువుగా గ్రహించి, సైగచేసి పక్కకుపిలిచి, ఏదోచెప్పాలని నోరుతెరచిన పళ్ళమ్మిని మాట్లాడకుండా తమతో రమ్మని హెచ్చరించి, ముగ్గురూ కొంతదూరం వెళ్ళి కూడబలుక్కొని తిరిగివచ్చి, ఇంకా రాగాలుతీస్తూ పడివున్న కుఱ్ఱవాడి తలిదండ్రులను గద్దించి, కుఱ్ఱవాడే వస్తున్న కారును లెక్కపెట్టకుండా రోడ్డుకడ్డంగా పరుగెత్తి కారుకిందపడ్డాడని పళ్ళమ్మి సాక్ష్యంచెప్పగా, ఆవిషయమే కానిస్టబుల్ వ్రాసుకుని, కుఱ్ఱవాడి తలిదండ్రులను రూళ్ళకఱ్ఱతోఅదలిస్తూ మరోమారు గద్దించి, అంతకుముందే కార్లోకూర్చుని స్టార్ట్ చేయడానికి సిద్ధమైవున్న సేట్ జీకి ఒత్తుగావున్న జేబును తృప్తిగా తడుముకుంటూ సెల్యూట్ చేయగా, సేట్ జీ చిరునవ్వుతో కారుస్టార్ట్ చేసి రివర్సుగేర్ లో కొంతదూరంనడపి, కొళాయిపక్క ఆపి, డిక్కీతెరచి, డబ్బాతీసుకుని, కొళాయిగుంతలో ఆగిన నీటితో రక్తం మరకలు కడగడానికి మొదలెడుతుండగా, పళ్ళమ్మి గబగబావచ్చి తనే మరకలన్నీ శుభ్రంగాకడిగి డబ్బా అందిస్తున్నప్పుడు ప్రయత్నపూర్వకంగా ఖరీదైన తన మునివేళ్ళు పళ్ళమ్మిచేతికి తాకించి ఆ అనుభూతికి మైమరచి, వెంటనే తెలివితెచ్చుకుని, గిరుక్కున తిరిగి వెళ్ళిపోతున్న పళ్ళమ్మికేసిచూసి నిట్టూరుస్తూ- ఇది సమయంకాదని కారు స్టార్ట్ చేసి, వుంగరాలు సింగారించుకున్న వేళ్ళతో స్టీరింగ్ వీల్ ను సుతారంగా తిప్పుతూ నెమ్మదిగా కదిలిపోయాడు కారులో సేట్ జీ.

సాబ్ స్టఫ్:— రోగంతో లేవలేనిస్థితిలోవున్న తల్లినీ, నిస్సహాయుడైవున్న తండ్రినీ, ఇంతవరకు ఎన్నెన్నో వేషాలువేసి, డ్యాన్సులుచేసి, డబ్బుసంపాదిస్తూ ఎలాగో పోషిస్తున్న కుఱ్ఱవాడు, పసివాడు, పన్నెండేళ్ళవాడు, రాజుకుంటున్న బూట్ పాలిష్ సెట్ కొనుక్కోవాలనే కోరిక నెరవేరకముందే- కొత్త '66 మాడల్ ఫియట్ కారుకిందపడి, రేసెస్ లోగెల్చిన పాతికవేల సంబరంకిందబడి, బోట్ క్లబ్ లో మిసెస్ మాలిని గులాబీ రేకుల్లాంటిచేతుల్లో నలుగుతున్నట్లు వూహించే వూహలకిందపడి, పళ్ళమ్మి యవ్వనాన్ని గూర్చిన తలపులకిందపడి. కరుకైన వజ్రపుటుంగరాలూ, నున్నగా తళతళలాడేట్టు

పాలిష్‌చేయబడిన బూట్లూ నడుస్తున్న అపమృత్యువు వాతపడి, సేట్‌జీ లాల్చీజేబులోంచి కానిస్టేబుల్ దఃసరి నిక్కరుజేబులోకీ, పళ్ళమ్మి చిరుగుల జాకెట్ మరుగుకూ బదిలీఅయిన నోట్లకిందపడి, పళ్ళమ్మి చెప్పిన ఒకేఒక అబద్ధంకిందపడి, కానిస్టేబుల్ గద్దింపులకిందపడి, అల్యూమినియం గిన్నె దూరంగా జారిపడినా పావలానాణెం కింద పడిపోకుండా బిగించిన పిడికిలితో అలాగే చనిపోయాడు.

కిటికీవద్ద నిల్చున్న రచయిత కిటికీతెర వేసి వెనక్కువచ్చి ఫోల్డింగ్‌కుర్చీలో కూర్చుని అంతకుముందే తెరచివుంచిన ఫౌంటన్‌పెన్‌తో ఏదో వ్రాయడానికి వుపక్రమించాడు, కాని పాళీ ఎప్పుడో ఆరిపోయింది, విసుగ్గా విదిలించాడు. చారలు చారలుగా సిరా కక్కింది కలం.

---

కథ

# వేళ్ళు

పింగళి రంగారావు.

---

వార్డు జోగుతూ నిద్రపోతున్నట్లుగావుంది. రాత్రికూడా అప్టైకాలేదు. అరచి అరచి పేషంట్లు మగతగా నిద్రపోతున్నారు. అక్కడో లైటు అక్కడో లైటు మబ్బుగా వెలుగుతున్నాయి. దూరంగా అరగంటకో నర్సు వార్డు ప్రక్కనుంచి అగుపడి మాయమౌతోంది. గతరాత్రిలా వార్డులో అలజడి లేదు. పదిగజాల దూరంలో నుండి పిల్లలు కొట్లాడుతున్నట్లుగా పిల్లలవార్డునుండి అరుపులు వినొస్తున్నాయి–

నిద్రపోతున్నవాణ్ణెవరో లేపుతున్నారు. అస్పష్టంగా మూల్గులు.

విసుక్కుంటూ లేపేవ్యక్తి "మందు" అంటోంది–

తాను విసుక్కుంటూ ప్రక్కకు తిరిగాడు.

"మందు త్రాగండి."

విషంలా మ్రింగాడు. మళ్ళీ చెదిరింది నిద్ర. అవే ఆలోచనలు. గొంతులో సెగవేస్తున్నట్లుగావుంది. తానింతటి దురదృష్టవంతుడౌతాడని కలలోకూడా అనుకోలేదు.

వసంత ఇంట్లో ఏంచేస్తోందో– ఏంచేస్తుంటుంది, నానిబుజ్జిని గుండెల కత్తుక్కుని ఏడుస్తుంటుంది. దిక్కులేని దేవుళ్ళకు మొక్కుతూ వుంటుంది. వేంకటేశ్వ